


# తేజస్సు

వజ్ర పుర్రె

Autobiography

# TEJASSU

Vajra Purre

# TEJASSU

Vajra Purre
TGSWRDC, Nizamabad.

SCHOOL OF
EMERGING WRITERS

We sincerely thank

Dr. ALAGU VARSHINI

Secretary, TGSWREIS

| | | |
|---|---|---|
| Book Title | : | Tejassu |
| Author | : | Vajra Purre |
| Chief Editor | : | Dr. K. Sandhya Deepthi |
| ISBN | : | 9789348512413 |
| First Edition | : | 2024 |

Copyright© **Vajra Purre**

The authors are responsible for the contents of their papers compiled in the publication. The publishers or the printers or the editors are not responsible to any consequences of copyright infringement for the works presented in this volume. In spite of best efforts, there could be some errors in this publication and the reaches are requested to communicate any errors to the editors to avoid any such errors in future.

**Paramount Publishing House**

Plot No. A-531, H.No. 4-32-521, Phase-1, Allwyn Colony, Kukatpally, Hyderbad.
Ph. 7799000082
Sales Offices:
Hyderabad
Plot No. A-531, H.No. 4-32-521, Phase-1, Allwyn Colony, Kukatpally, Hyderbad.
Ph. 7799000082
New Delhi
C/14, SDIDC Work Centre Jhilmil Colony, New Delhi-100095,
paramountpublishers@gmail.com I alluriasr2005@yahoo.com
Published by Krishna Prasad Alluri for Paramount Publishing House and printed by him at Sai Thirumala Printers.

SCHOOL OF
EMERGING WRITERS
TGSWREIS

# ముందుమాట

## *Author's Note*

CHIEF EDITOR:
Dr. K. Sandhya Deepthi

# *Letter to the Readers*

To exist, is to create. We wish our young souls to become creators of stories —stories that talk that sing, that move; stories that show and wish to be seen. School of Emerging Writers is enthralled by the essential vision, which is to democratise creativity: to let the minds of our up-and-coming generation of story-tellers delve into every possible dimension of thought, to let their imagination unfold the 'very own' narratives and to let their expression be channeled around ways which leave a liberal room to manoeuvre in the process of self-discovery.

The Book-Writing Project is keen to reconnoiter the process of sharing common imagination and how such a united creative spirit eventually shapes assertiveness among students towards thought. Academics establish strict frontiers; sometimes, institutionalise the charisma of growing and learning within the classroom contexts. Nevertheless, no one is better than a mentor who can map through the mental geography of student community. As a diverse range of skills among students are ceasing to evolve due to a lack of diversity in opportunities— primarily in the arts — one needs to choose to be disquiet about limiting someone's potential by not creating opportunities. Because, as teachers and leaders, we need to create spaces; spaces that accommodate all variety of talents. For that reason, an initiative as this becomes instrumental in constructing one's own creative capabilities outside the traditional framework of academics; discovering and trusting their own selves as capable individuals. We therefore, dream of a liberal space where the boundaries of language, of genre and of subject are discerningly alleviated, helping students stand up to their own individual and collective anxieties.

The famous martial artist, cultural icon and often ideally referred to as "artist + philosopher", Bruce Lee states, "You must be shapeless, formless, like water. When you pour water in a cup, it becomes the cup. When you pour water in a bottle, it becomes the bottle. When you pour water in a teapot, it becomes the teapot. Water can drip and it can crash. Be water, my friend." 'To be water', as Bruce Lee unequivocally suggests, be the life-force of this endeavour; be immeasurably accommodative of everything and every infinitesimal idea sparkling far away in the imaginative minds of this young generation. Discover the brightest and the farthest stars.

Dr. K. Sandhya Deepthi
Coordinator,
School of Emerging Writers,
TGSWREIS.

# తేజస్సు

అసలు నేను ఎవరో మీకు తెలుసా?

నా పేరు పుర్రే వజ్ర. నేను వన్నెల్ (బి) అనే మారుమూల గ్రామంలో జన్మించాను. నా తల్లిదండ్రులు పుర్రే చిన్న దేవన్న, పుర్రే భారతి. అక్క పేరు పుర్రే తేజశ్విని. నా కన్న పదకొండు సంవత్సరాలు పెద్దది. మాది ఒక మధ్యతరగతి కుటుంబం. మా కుటుంబం అంతా రోజు మూడు పూటల అన్నం తినాలి అంటే ప్రతిరోజు అమ్మ, నాన్న పొలం పని చేయాల్సిందే. ముందుగా నా కుటుంబం గురించి చెప్పాలి అంటే మా తాతయ్య పేట్ల దేవన్న, నానమ్మ ఆశమ్మ. నానమ్మకు ఐదుగురు మగ పిల్లలు, ఇద్దరు ఆడ పిల్లలు. అందరికంటే మా నాన్న చిన్నవాడు. తాతయ్య నాన్నను  చాలా గారాబంగా చూసేవాడు. నాన్న అంటే తాతయ్యకు చాలా ఇష్టం. నాన్నను బడికి పంపకుండా ప్రతిరోజు తన వెంబడి ఆవులను మేపడానికి తీసుకుని వెళ్ళేవాడు. అలా నాన్నకు పొలం పనుల్లో ఆసక్తి పెరిగి పొలంపనిని చెయ్యడానికే ఇష్టపడేవాడు.




తేజస్సు

# గున్న



నాన్న వాళ్ళ అన్నలకు, అక్కలకు అందరికీ వివాహాలు జరిగాయి. అప్పటికి నాన్న వయసు చాలా చిన్నది, పదిసంవత్సరాలు మాత్రమే. ఆ సమయంలోనే నానమ్మ అనారోగ్యంతో చనిపోయింది. దీంతో నాన్నను, తాతయ్యను చూసుకోవడానికి ఎవరో ఒకరు ఉండాలి అని, నాన్న వాళ్ళ చిన్న అక్క (గున్న) పుట్టింట్లో ఉండి తమ్ముడిని పెంచాలి, నాన్నని చూసుకోవాలి అని నిర్ణయం తీసుకుంది. కానీ ఈ నిర్ణయం అత్తవాళ్ళ భర్తకి నచ్చలేదు. పుట్టింట్లో ఉండడం నాకు నచ్చదు అని అత్తతో వాదించాడు. అత్త వాళ్ళ భర్తని వదిలేసి పుట్టింట్లోనే ఉండిపోయి నాన్నని, తాతయ్యని చక్కగా చూసుకోవాలి అని విడాకులు తీసుకుంది. అలా అత్త పుట్టింటికి పరిమితం అయిపోయింది.

అత్త నాన్నని తల్లిలా చూసుకుంది. తల్లిలేని లోటుని తీర్చింది. నాన్నకు పదిహేను సంవత్సరాల వయసులోనే వివాహం చేశారు. వివాహం జరిగిన కొద్ది రోజులకే అత్త, నాన్నను బతుకుదెరువు కోసం దుబాయ్ పంపించింది. నాన్న దుబాయ్‌కి వెళ్ళిన సమయంలోనే అమ్మ గర్భం దాల్చింది. నాన్న విదేశాలకు వెళ్ళిన ఆరునెలల్లోనే అక్క జన్మించింది. ఆ కాలంలో దుబాయ్‌లో ఉండేవారు అందరు వారి కుటుంబాలకు ఉత్తరాలు రాసేవారు. నాన్న చదువుకోలేదు కాబట్టి, నాన్నకు ఉత్తరం రాయడం వచ్చేదికాదు. అక్కడ నాన్న ఉండే రూమ్‌లో నాన్నకు ఒక స్నేహితుడు ఉండేవాడు. అతనికి తెలుగు స్పష్టంగా వచ్చేది. నాన్నకు అతను తెలుగు చదవడం, రాయడం నేర్పించాడు. నాన్న ప్రతిరోజు పనినుంచి రూమ్‌కి రాగానే తన స్నేహితుని దగ్గర కూర్చొని తెలుగు చదివేవాడు.

అలా నాన్న తెలుగు నేర్చుకొని అమ్మకి ఉత్తరాలు రాయడం మొదలుపెట్టాడు. నాన్న రెండు సంవత్సరాలు విదేశాల్లో పనిచేసి కొన్ని డబ్బులు సంపాదించాక తిరిగి మా ఊరికి వచ్చాడు. నాన్న దుబాయ్ నుండి వచ్చిన కొంతకాలానికి తాతయ్య మరణించాడు. తాతయ్య మరణించిన తరువాత ఇంటి బాధ్యత మొత్తం అత్తనే తీసుకుంది. నాన్నకు, అమ్మకు మంచి చెడులు అన్ని చెప్పేది.

# దేవన్న-భారతి



తేజస్సు

# పెద్ద రెడ్డి



నాన్న వాళ్ళ నాలుగవ అన్న (పెద్దరెడ్డి). ఈ పెద్దనాన్న అంటే మా నాన్నకు చాలా ఇష్టం. మా నాన్నకే కాదు, ఇంట్లో వాళ్ళందరికి ఇష్టం. పెద్దనాన్నకి పెళ్ళికాకముందే మాదాపూర్‌లో మాకు తెలిసిన వారు పెద్దనాన్నని ఇల్లరికం తీసుకొని వెళ్ళారు. కొంతకాలం వాళ్ళ దగ్గర ఉంచుకొని వాళ్ళ కూతురుని పెద్దనాన్నకి ఇచ్చి వివాహం చేశారు. వివాహం అయిన తరువాత పెద్దనాన్న, పెద్దమ్మ అప్పుడప్పుడు మా ఇంటికి వస్తూ ఉండేవారు. మా ఇంటికి వచ్చిన ప్రతిసారి మా ఇంట్లోనే ఉండేవారు, ఇంకా ముగ్గురు పెద్దనాన్నల ఇంటికి వెళ్ళేవారు కాదు. ఏదో కొంచెం సేపు వాళ్ళ ఇంటికి వెళ్ళి మాట్లాడించి వచ్చేవారు. మొత్తం మా ఇంట్లో మా అమ్మ, నాన్న అత్తమ్మతో ఉండేవారు.

పెద్దనాన్న, పెద్దమ్మకి కావలసినవన్ని అత్తమ్మనే చూసుకునేది. వారు మా ఇంట్లో ఉన్నన్ని రోజులు వారికి ఎలాంటి లోటులేకుండా మొత్తం అత్తమ్మనే చూసుకునేది. కొద్దిరోజులకి పెద్దనాన్న వాళ్ళకి ఆడపిల్ల జన్మించింది. పెద్దనాన్న, పెద్దమ్మ సంతోషానికి అవధులు లేవు. తొలి సంతానం ఆడపిల్ల పుట్టింది. ఇంటికి మహాలక్ష్మి, తనని చాలా గారాబంగా పెంచుదాం, తన కాళ్ళకి దుమ్ము అంటనివ్వకుండా చూసుకుందాం అని లెక్కలేని కలలుకన్నారు. పెద్దనాన్న కూడా తల్లిప్రేమకు నోచుకోలేదు. కాబట్టి తన కూతురిలో అమ్మను చూసుకుందాం అని అనుకున్నాడు. కానీ ఈ కలలు అన్ని నీళ్ళపాలు అయిపోయాయి. కన్న కూతురు మరణించింది. పెద్దనాన్న పెద్దమ్మ చాలా బాధపడ్డారు. వారు అనుభవించిన బాధ అంతా ఇంతా కాదు. ఆ బాధ తల్లిదండ్రులకే అర్థం అవుతుంది.

మన అమ్మ, నాన్నలకి చెప్పకుండా ఎక్కడికి వెళ్ళినా వారి కళ్ళ ముందు లేము అని ఆందోళన పడతారు. అలాంటిది పెద్దనాన్న పెద్దమ్మకి వారి కూతురు శాశ్వతంగా లేదు అనే విషయం తెలిసాక వారి గుండెలు పగిలిపోయి ఉంటాయి. వారు ఆ సందర్భంలో ఎలా ఉన్నారో అని తలచుకుంటే నా ఊహకు కూడా అందడం లేదు.

అసలు ఇలాంటి పరిస్థితి ఎవరికి రాకూడదు. పెద్దనాన్న, పెద్దమ్మ ఆ బాధ నుంచి కొంచెం కోలుకోవాలి అని అమ్మ, నాన్న, మా అక్కను ఒక నెలరోజులపాటు అత్తమ్మతో పెద్దనాన్న వాళ్ళ దగ్గరికి పంపారు. అక్క పెద్దనాన్న పెద్దమ్మకి చాలా దగ్గర అయిపోయింది. ఎంతలా అంటే వాళ్ళ దగ్గర ఉన్నన్ని రోజులు అమ్మ నాన్నని కూడా గుర్తుచేసేది కాదంట. పెద్దనాన్న పెద్దమ్మకి కూతురు మరణించాక మళ్ళీ సంతానం కాలేదు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా, ఎన్ని దేవుళ్ళకి మొక్కినా, ఎంత చూపించినా సంతానం కాలేదు.

# తేజశ్విని



ఏం చేసినా లాభం లేదు అని పెద్దనాన్న మా అక్కను దత్తత తీసుకొని మంచిగా పెంచుదాం అని నిర్ణయం తీసుకున్నాడు. కానీ అప్పటికి అమ్మ నాన్నకి నేను జన్మించలేదు. కాబట్టి ఒకరు జన్మించాక అక్కను తీసుకెళదాం అని అనుకున్నారు. కానీ పెద్దనాన్న పెద్దమ్మ చేతులమీద పెరిగే అదృష్టం అక్కకి లేదు. వాళ్ళని చూసే అదృష్టం నాకులేదు. ఒకరోజు పెద్దనాన్న నిజామాబాద్ నుండి ట్రాక్టర్ మీద మాదాపూర్‌కి వచ్చే మార్గంలో రోడ్డుమీద లారీ వచ్చి ట్రాక్టర్‌ని ఢీ కొట్టింది. ట్రాక్టర్ బోల్తా పడడంతో పెద్దనాన్న అక్కడికక్కడే కన్నుమూశాడు. పెద్దనాన్న మరణించడంతో మనకు కుడిచేయి లేకపోతే ఎలా ఉంటుందో మా ఇంట్లో గతి అలా అయిపోయింది. పెద్దనాన్న చావు కార్యాలు అన్ని కూడా మాదాపూర్‌లోనే చేశారు. కార్యాలు అన్నిటిని మా ఇంట్లో వాళ్ళు దగ్గరుండి జరిపించారు. అన్ని ముగిశాక అమ్మా, నాన్న అందరు మా ఊరికి వచ్చేశారు. మళ్ళీ ఎప్పుడు కూడా మా ఇంట్లో వాళ్ళు మాదాపూర్ వెళ్ళడం, పెద్దమ్మ మా ఊరికి రావడం జరగలేదు. అలా పెద్దమ్మ మాకు దూరం అయిపోయింది. కానీ పెద్దమ్మ పెద్దనాన్న చనిపోయాడు అని మళ్ళీ వివాహం చేసుకోలేదు. పెద్దనాన్న పేరుమీదనే ఉండిపోయింది. పెద్దమ్మ అంటే మా ఇంట్లో వాళ్ళందరికి చాలా ఇష్టం. కరోనా సమయంలో పెద్దమ్మకి కరోనా వచ్చి మరణించిందంట, మాకు ఈ విషయం ఆలస్యంగా తెలిసింది. ఇంట్లో వాళ్ళు అందరు కూడా చాలా బాధపడ్డారు. నాకు అయితే చాలా ఏడుపు వచ్చింది. నేను పెద్దమ్మను చూడకపోయిన పెద్దమ్మ అంటే చాలా ఇష్టం ఉండేది నాకు.

అమ్మా, నాన్న, అత్త ఓ చిన్న పెంకుటింట్లో ఉండేవారు. నాన్న సంపాదించిన కొంత డబ్బుతోనే ఎలాగైనా మంచి ఇల్లు కట్టించాలి అని అత్త పట్టుపట్టి నాన్నతో ఇల్లు కట్టించింది.

అమ్మా, నాన్న ప్రతిరోజు పొలం పనిచేస్తూ అక్కను చాలా గారాబంగా పెంచారు. అక్కకు నాలుగు సంవత్సరాలు రాగానే మా ఊరిలో ఉన్న ప్రైవేట్ బడికి పంపించారు. అలా అక్కకి ఏడు సంవత్సరాలు దగ్గరికి వస్తున్నాయి, కానీ అమ్మకు రెండవసారి గర్భం దాల్చలేదు, ఇంట్లో అందరు చాలా దిగులుపడ్డారు. రెండవ సంతానం కోసం అమ్మానాన్న చాలా ఆసుపత్రులు తిరిగారు. కానీ అమ్మకి గర్భం దాల్చలేదు. ఇలా ఏం చేసినా ప్రయోజనం లేదు అని శ్రీ వెంకటేశ్వర స్వామి మీద భారంవేసి అంతా నీ దయనే అని వేడుకున్నారు. అక్కకు పది సంవత్సరాలు ఉన్న వయసులో అమ్మ రెండవసారి గర్భం దాల్చింది.

ఇల్లు అంతా కుటుంబ సభ్యులతో కళకళలాడుతుంది. అందరు చాలా ఆనందంగా ఉన్నారు. కుటుంబంలో అందరికి ఓ నమ్మకం అమ్మ పదిసంవత్సరాలకు రెండవ గర్భం దాల్చింది, కాబట్టి కచ్చితంగా కొడుకు పుడతాడని, అందరు కొడుకే పుట్టాలి అని కోరుకున్నారు. మా నాన్నకు అయితే తొలి సంతానం కూతురు పుట్టింది కాబట్టి, రెండవ కాన్పు అయినా కొడుకు పుట్టాలి, మా కుటుంబాన్ని నా కొడుకే చూసుకోవాలి అని చాలా

కోరిక ఉండేది. ఎవరు ఏం చెప్పినా, నాన్న మాత్రం కొడుకు పుడతాడు అనే ఒక గట్టినమ్మకంతో ఉండేవాడు. ఎంతలా అంటే కూతురు పుడితే ఎలా అనే ఆలోచన కూడా నాన్న మనసులో వచ్చేదికాదు. అమ్మ మాత్రం ఎవరు పుట్టిన సంతోషమే అని అనుకుంది, ఎందుకు అంటే రెండవ కాన్పు కావడమే అదృష్టం అని భావించింది.

అమ్మ కడుపులో భద్రంగా ఉన్న నాకు ఈ లోకంలోకి రావాల్సిన సమయం రానే వచ్చింది. ఒకరోజు సంధ్యవేళ సాయంకాలం నేను పుట్టాను. నేను పుట్టిన వేళావిశేషం ఏమిటో కాని ఎవరి ముఖంలో కూడా ఆనందం లేదు. అందరు మళ్ళీ కూతురు పుట్టింది అని బాధపడ్డారు. మా నాన్న అయితే కనీసం నా ముఖం కూడా చూడలేదు. బాధతో ఇంటికి వెళ్ళిపోయాడు. మరుసటిరోజు నాన్న బాధతో కాకుండా బాధ్యతగా, ఇష్టంగా ఆలోచించాడు. కూతురు పుడితే ఏంటి కొడుకులా పెంచుతాను. నా ఇద్దరు కూతుళ్ళనే నా కొడుకులు అనుకొని ఆసుపత్రికి వచ్చి నన్ను చేతుల్లోకి తీసుకొని ముద్దాడాడు. అక్కను ఎంత గారాబంగా పెంచారో అంతకన్న ఎక్కువ గారాబంగా నన్ను చూసుకున్నారు. కొన్ని సందర్భాల్లో అక్క ఏడ్చేది. ఎందుకు అంటే తన కన్న నన్ను ఎక్కువ ప్రేమగా చూసుకుంటున్నారు అని.

అత్తకు నేను అంటే చాలా ఇష్టం. నేను రోజంతా అత్త దగ్గరే ఉండేదాన్ని. రాత్రి మాత్రమే అమ్మ వాళ్ళ దగ్గర పడుకోవడానికి వచ్చేదాన్ని. అత్త ఏ పనికి వెళ్ళినా సాయంత్రం వచ్చేటప్పుడు తినడానికి నాకోసం ఏదో ఒకటి తీసుకువచ్చేది. అత్తతో ఎటు బయటికి వెళ్ళినా నడిచేదాన్ని కాదు. అత్త వీపుమీద ఎక్కి వెళ్ళేదాన్ని (గొర్రెపిల్లలా).

# వజ్ర



మా కుటుంబాన్ని మొత్తం అత్తనే చూసుకునేది. నాన్న అయితే అత్త మాట జవదాటేవాడు కాదు. కుటుంబం అంతా సంతోషంగా సాఫీగా సాగుతుంది, అనే సమయంలో ఒకరోజు సడన్‌గా మా అత్తమ్మను ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. అందరం షాక్ అయ్యాం. రెండురోజులకి బాగా అయి వస్తుందని అనుకున్నాం కానీ ఇంకా సీరియస్ అయి నిజామాబాద్‌లోని హాస్పిటల్‌లో ఐ.సి.యులో ఒకవారం పాటు చికిత్సచేశారు. ఆ సమయంలో మమ్మల్ని అంతగా ప్రేమించే మా అత్తను బెడ్‌పై కదలలేని స్థితిలో చూడడానికి ధైర్యం చాలలేదు, భయం కూడా వేసింది.

అసలు ఏడుపు రాలేదు, ఎందుకంటే మళ్ళీ మామూలు మనిషి అయి అత్త తిరిగి వస్తుంది అనే నమ్మకంతో, ఆ సమయంలో అమ్మా, నాన్న అందరు హాస్పిటల్‌లో అత్తను చూసుకోవడానికి ఉండడంతో నేను పెద్దమ్మ వాళ్ళింటి దగ్గర ఉన్నాను. ఒక వారం గడిచాక డాక్టర్లు ఇంకా లాభం లేదని, ఇంక తిరిగిరాదని చెప్పేసరికి అందరి కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. అత్తలేదనే విషయాన్ని నాన్న జీర్ణించుకోలేకపోయాడు. ఎందుకంటే అక్క ప్రేమలోనే తల్లిప్రేమను చూసుకున్నాడు. ఒకరకంగా తల్లి కన్నా ఎక్కువే, ఎందుకంటే మా నాన్న, తాత కోసం తన వ్యక్తిగత జీవితాన్నే వదులుకుంది.

మా అత్త కార్యక్రమాలన్నీ అయ్యాక మెల్లగా అందరూ మరిచిపోయి మామూలు అయ్యారు. కానీ నాన్న మాత్రం త్వరగా మామూలు మనిషి కాలేదు. ఎవరు ఏం చెప్పినా ఊరికనే కోపగించుకోవడం, ఎవరి మాట వినకపోవడం, అంతా వింత వింతగా ఏదోలా చేసేవాడు.

తరువాత అక్కను, నన్ను చూస్తూ మాకోసం అయినా మంచిగా ఉండాలి, మళ్ళీ మామూలు మనిషిలా కావాలి అనే ఉద్దేశంతో నాన్న నెమ్మదిగా మనసు కుదుటపరుచుకున్నాడు. అత్త మాకు మంచీ, మర్యాద, నీతి, నిజాయితీ, ఎవరితో ఎలా ఉండాలి, ఇలాంటివి అన్ని సంస్కారాలు నేర్పడం వల్లనే ఈ రోజు మేము, మా కుటుంబంతో ఒక మంచిస్థాయిలో బతుకుతున్నాం. మాకంటూ ఊరిలో ఫలానా వారు మంచివారు, మర్యాదస్తులు అనే పేరు ఉంది, అంటే దానికి ముఖ్యకారణం అత్తనే.

మా అక్కకు నేనంటే చాలా ఇష్టం. అక్కకి నేను చెల్లెలిగా పుట్టినందుకు, నేను అంటే ఇష్టం ఉన్నా లేకపోయినా ఇష్టంగానే చూసుకోవాలి, వేరే మార్గం లేదు అక్కకి. అక్క రోజూ సాయంత్రం నన్ను తీసుకొని ఆడుకోడానికి వాళ్ళ స్నేహితుల ఇంటికి వెళ్ళేది. అలా ఒకరోజు సాయంత్రం అక్క నన్ను ఆడుకోవడానికి వాళ్ళ స్నేహితుల ఇంటికి తీసుకెళ్ళింది. అక్కడ అక్క వాళ్ళ స్నేహితులు అందరు ఇంటి డాబా మీదనుండి ఇంటి వెనకాల ఉన్న గడ్డిమీద దూకడం ఒక ఆటలాగా ఆడుతున్నారు. కానీ అక్క ఎప్పుడు కూడా ఇంటిమీద నుండి గడ్డిమోపు మీద దూకేది కాదు. ఆరోజు మాత్రం నేను ఉండడం వల్ల అక్క స్నేహితులు నామీద ఒట్టువేశారు. నామీద ఉన్న ప్రేమతో తెలిసి తెలియని వయసులోనే అక్క నా కోసం ఇంటిమీద నుండి గడ్డిమోపు మీదకి దూకింది.

కానీ అక్క గడ్డిమోపు మీద పడకుండా కొంచెం పక్కన గడ్డి తక్కువ ఉన్నచోటపడింది. ఆ ఒక్కక్షణం అసలు ఏంజరిగిందో కూడా అక్కకు అర్థం కాలేదు. దేవుడి దయవల్ల అక్కకు తీవ్రంగా గాయాలు ఏం కాలేవు. కానీ నడుము కొంచెం పట్టేసినట్టు అయింది. ఈ విషయం అమ్మా, నాన్నకు చెప్పలేదు. కొద్దిరోజుల తరువాత మెల్లిగా అమ్మకు చెప్పింది. అమ్మ అక్కను చాలా తిట్టింది.

అక్కకు హాస్టల్‌లో చదువకోవడం అంటే చాలా ఇష్టం. కానీ అమ్మా, నాన్నకు హాస్టల్‌లో చదివించడం అంటే అస్సలు నచ్చేదికాదు. అక్క నాలుగవ తరగతి చదివేటప్పుడు గురుకుల పరీక్ష రాసింది. అక్క పరీక్ష రాసేటప్పుడు, పోనీలే తన తృప్తికోసం రాస్తుందిలే అని అనుకున్నారు. కానీ, అక్కకు గురుకులాల్లో సీట్ వచ్చింది. అక్క హాస్టల్ వెళ్త అని ఎంత ఏడ్చినా అమ్మా, నాన్న హాస్టల్‌కి పంపకుండ ఊర్లో ఉన్న బడిలోనే చదివించారు. అక్క కష్టపడి చదివి సీట్ సంపాదించుకుంది, మొత్తం వృధా అయిపోయింది. అక్క ఎలాగైనా హాస్టల్‌లో ఉండి చదువుకోవాలి అని పట్టుపట్టింది.

❀❀❀❀



మళ్ళీ ఆరవ తరగతిలో గురుకుల పరీక్ష రాసింది. మళ్ళీ అక్కకు గురుకులాల్లో సీట్ వచ్చింది. అమ్మ నాన్నను ఎలాగైనా ఒప్పించి హాస్టల్‌లో చదువుకోవాలి అని ఓ గట్టి కంకణం కట్టుకుంది. అక్క అనుకున్నట్లే అమ్మా, నాన్నను ఒప్పించుకుంది. ఏడవ తరగతిలో గురుకుల హాస్టల్‌కి వెళ్ళిపోయింది. ప్రతినెల అక్కని చూడడానికి రెండవ శనివారం రోజున అమ్మా, నాన్న నేను వెళ్ళేవాళ్ళం. అలా ఓసారి అక్కను చూడడానికి వెళ్ళినప్పుడు, వెళ్ళడం వెళ్ళడమే అక్కను గట్టిగా పట్టుకొని కొరికాను. డ్రెస్‌మీద నుండి కొరికితే రెండు చుక్కల రక్తం కూడా వచ్చింది. కోపంతో కాదండి, చాలా రోజులకి చూసేసరికి కొంచెం ప్రేమ ఎక్కువయి ఏం చెయ్యాలో తెలియక కొరికాను. అదేనండి! రాక్షస ప్రేమ అంటారు కదా. నా ప్రేమ కూడా నా చిన్నతనంలో కొంచెం అలాంటిదే. అక్క ఇంటర్ వరకు చదువు పూర్తిచేసుకుంది. ఆ తరువాత డాక్టర్ చదవాలి అని అనుకుంది. డాక్టర్ కావాలి అని అక్క కల. కానీ నాన్న దగ్గర డాక్టర్ చదివించే స్తోమత లేకపోవడంతో అక్క తన కలను వదులుకోవాల్సి వచ్చింది. ఎంత అయినా ఇంట్లో పుట్టిన మొదటివారికి అర్థం చేసుకునే గుణం చాలా ఎక్కువగా ఉంటుంది. వారు కుటుంబం కోసం చేసే త్యాగాలకు మనం ఎంత చేసినా, ఎంత గొప్పగా చెప్పినా తక్కువే. అక్కని డాక్టర్ చదివించలేకపోతున్నాను అని నాన్న చాలా బాధపడ్డాడు. కానీ, అక్క చదువు ఇక్కడితో ఆగిపోలేదు. డాక్టర్ కాకపోయినా ఏదో ఒక గవర్నమెంట్ ఉద్యోగం వచ్చేలా చదివించాలి అని అనుకున్నాడు.





ఈ మాట నాన్న పిన్నితో (అమ్మ వాళ్ళ చెల్లి) చెప్పాడు. అప్పుడు పిన్ని ఒక సలహా ఇచ్చింది. టీచర్ ఉద్యోగం బాగుంటుంది, అది చదివించండి అని. పిన్ని అంటే గుర్తు వచ్చింది. అమ్మ వాళ్ళు మొత్తం నలుగురు, మొదట మామయ్య (గంగారాం), తరువాత పెద్దమ్మ (లక్ష్మి), తరువాత (అమ్మ భారతి) చివరిగా పిన్ని (పుష్ప).

అమ్మమ్మ (ముత్త), తాతయ్య (గంగారాం). ఇంట్లో ఉన్న నలుగురు పిల్లలని చదివించడానికి రేయి, పగలు, ఎండనక వాననక కష్టపడి పనిచేసేవారు. అమ్మ మాత్రం బడికి వెళ్ళమని తిట్టినా, కొట్టినా వెళ్ళకుండా ఒకటే పట్టుపట్టేది. పొలం పనికి వెళ్తానని అనేది. అమ్మమ్మ కూడా అమ్మ ఇష్టాన్ని ఎందుకు కాదనాలి అని పొలం పనికే పంపేది. పెద్దమ్మ ఇంటి పరిస్థితుల వల్ల ఏడవ తరగతి అయిపోగానే చదువుకోవడం మానేసింది. మామయ్య, పిన్ని ఎన్ని అడ్డంకులు వచ్చినా, ఎంత కష్టం అయినా ఇష్టంగా చదువుకొని ఉద్యోగం సంపాదించుకున్నారు. అమ్మమ్మ వాళ్ళ ఇంట్లో మంచి, చెడు ఎలాంటి కార్యాలు జరిగినా పిన్ని ముందుండి నడిపిస్తుంది. మామయ్యకు పిన్ని కుడి భుజంలాంటిది. మామయ్యకు ఎలాంటి కష్టం వచ్చినా, పిన్ని నేను ఉన్నాను, నువ్వు ఏం దిగులు పడకు, అంటూ ధైర్యం చెప్పి సగం బాధ తీర్చుతుంది. పిన్ని అందరికన్నా చిన్నది, అయినప్పటికి పెద్దదానిలా ఆలోచిస్తూ ఏది అయిన బరువు అనుకోకుండా బాధ్యత అనుకొని ఎవరికి ఎలాంటి కష్టం వచ్చినా పిన్నినే చూసుకుంటుంది. పిన్ని అంటే ఇంట్లో వాళ్ళ అందరికి ఇష్టం, భయం, భక్తి, గౌరవం ఉంటుంది.

అలాగే నాన్న కూడా పిన్ని మాట మీదుగా అక్కను డి.ఎడ్. చదివించాడు. అక్క చదువులో చాలా తెలివిగలది. అక్క డి.ఎడ్ చదివి తన ట్రైనింగ్‌ని పూర్తిచేసింది. అక్క ట్రైనింగ్ పూర్తి అయిన కొద్దిరోజులకే గవర్నమెంట్ ఎస్.జి.టి. పోస్టులు విడుదల చేసింది. అప్పుడు అక్క ఒకే లక్ష్యం పెట్టుకుంది, ఎలాగైనా ఎస్.జి.ఇ.కి బాగా చదివి మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సంపాదించాలి అని, రాత్రి, పగలు కష్టపడి చదివేది, అదే సమయంలో మా ఊరిలో ఉన్న ప్రభుత్వ ప్రయిమరీ స్కూల్ నుండి ప్రిన్సిపల్ సార్ మా ఇంటికి వచ్చి అక్కను బడిలోకి చదువు చెప్పడానికి రమ్మన్నారు. ప్రిన్సిపాల్ సార్‌కి అక్క గురించి ఎలా తెలుసు అనుకుంటున్నారా..?

మా ఊరి సర్పంచ్ (కిషన్) గారికి నాన్న చాలా తెలిసిన వ్యక్తి. చెప్పాలి అంటే ఒక చిన్న తమ్ముడిలా చూసుకుంటాడు నాన్నను. అలా సర్పంచ్ గారు ప్రిన్సిపాల్‌కి అక్క గురించి చెప్పాడు.

అక్కకు కూడా ట్రైనింగ్‌లో చదువుచెప్పడం అలవాటు అయింది కాబట్టి అక్క సరే అని ఒప్పుకుంది. అలా ఒక సంవత్సరం పాటు ఊరిబడిలో చదువు చెప్పింది. తరువాత డి.ఎస్.సి పరీక్ష కోసం కోచింగ్‌కి వెళ్ళిపోయింది. అక్క మూడునెలల్లో కోచింగ్ పూర్తిచేసుకుంది. కానీ డిఎస్‌సి పరీక్ష రాయడానికి చాలా సమయం ఉంది, అని అక్క ఇతర కాంపిటీటివ్ పరీక్షలు కూడా రాయడం మొదలుపెట్టింది. అలా అక్కకు గ్రూప్ 4 పరీక్షలో పంచాయతీ సెక్రెటరీ ఉద్యోగం సంపాదించింది. ఈ ఉద్యోగం చేస్తూనే ఒకవైపు డిఎస్‌సి పరీక్ష రాసింది. అక్క ఈ ఉద్యోగం తొమ్మిదినెలలు చేసిన తరువాత డిఎస్‌సి ఫలితాలు విడుదల అయ్యేరోజు రానే వచ్చింది.

అప్పుడు అక్కను చూడాలి ఇగ, గోడమీద పిల్లిలా ముడుచుకొని మా ఇంట్లో ఉండే దివానా మీద కూర్చొని ఉంది. అసలు ఉద్యోగం వస్తదా? ఏం అయితది? అని భయపడుతున్న అక్కని అలాచూస్తూ ఉంటే ఎంత నవ్వచ్చిందో నాకు.

ఆరోజు అర్ధరాత్రి రెండు గంటలకు ఫలితాలు విడుదల అయ్యాయి. కానీ అక్క మరుసటిరోజు ఏడు గంటలకు అక్క ఫోన్ చూస్తూ మురిసిపోతుంది. తనలో తనే నవ్వుతుంది, తన కళ్ళలో ఆనందం అంతులేనంత కనబడుతుంది. అసలు ఏం అయి ఉంటుంది, అని అక్క దగ్గరకు వెళ్ళి అడిగితేగాని తెలియలేదు, అక్కకి టీచర్ ఉద్యోగం వచ్చింది అని. ఆ క్షణం అమ్మా నాన్న ఆనందానికి అవధులు లేవు. వారు కష్టపడి పనిచేసి చదివించినందుకు అక్క ఫలితం చూపించింది. అక్కకి ఉద్యోగం రాకమునుపు ఇంటిదగ్గర ప్రిపేర్ అవుతున్నప్పుడు అమ్మా నాన్నలకు పొలం పనులలో కూడా చాలా సాయంగా ఉండేది.

తల్లిదండ్రులతో ప్రేమగా, బాధ్యతగా ఉండేది. అలాగే పనులలో సాయంగా ఉండేది. ఇరుగు పొరుగు వారు కూడా మెచ్చుకునేంతగా, అక్క ఉద్యోగం వచ్చిన రెండు నెలలకి ప్రేమ వివాహం చేసుకుంది. అక్క వాళ్ళ భర్త నాగరాజు, అక్కకి ప్రస్తుతం ఒక కొడుకు (చార్విక్) జన్మించాడు.



**ఇక చివరిగా మిగిలి ఉన్న నా బాల్యం, చదువులు చూద్దాం రండి!.**

ఇంట్లో చిన్నదాన్ని, కాబట్టి అందరు కూడా అతి గారాబం చేసేవారు. మా ఊరిలో అక్క చదివిన స్కూల్లోనే నన్ను కూడా చేర్పించారు. ఇక్కడ మొదలైతది అసలైన కథ. నేను స్కూల్‌లో చేరేంతవరకు అందరు వజ్ర (వజ్జు) అని పిలిచేవారు. కానీ స్కూల్‌లో నన్ను చేర్పించినప్పుడు నా పేరు కోసం అమ్మ, అత్త మధ్య ఓ చిన్నపాటి యుద్ధమే జరిగింది. అమ్మనేమో అక్క పేరు తేజస్విని కాబట్టి నాపేరు యశస్విని పెట్టాలి అని అనుకుంది. అత్తనేమో వజ్ర అనేపేరు ఉండాలి అని అనుకుంది. నేను ఎల్.కె.జి.లో ఉన్నప్పుడు నా పేరు వజ్ర, యు.కె.జి.లో యశశ్విని, ఒకటవ తరగతిలో మళ్ళీ వజ్ర, రెండవ తరగతిలో మళ్ళీ యశశ్విని, మూడవ తరగతిలో మళ్ళీ వజ్ర. ఇది అంతా చూసిన మా ప్రిన్సిపాల్ సర్ ఏదో ఒకపేరు పెట్టండి, ఇలా సంవత్సరం సంవత్సరం పేరు మారితే, పై చదువులకు వెళ్ళేటప్పుడు మీ అమ్మాయికే ఇబ్బంది అవుతుంది, అని చెప్పాడు. అప్పుడు అమ్మ ఒక మెట్టు తగ్గి అత్త మాటకు గౌరవం ఇచ్చి సర్లే ఎవరు పేరు పెడితే ఏముంది, వజ్ర పేరు కూడా బాగుందని అప్పుడు అందరు మళ్ళీ వజ్ర అనే పేరు ఫిక్స్ చేశారు. ('ఫస్ట్ ఈజ్ ద బెస్ట్' అంటారు కదా అలా వజ్ర పేరు ఉండిపోయింది). అప్పటినుండి నేను వజ్రగా స్కూల్లో అందరికి పరిచయం అయ్యాను.



నేను రోజు స్కూల్‌కి వెళ్ళేటప్పుడు అమ్మ నాకు అన్నం తినిపించి పంపేది. నేను అన్నం తినకపోతే ఆరోజు స్కూల్‌కి పంపేదికాదు. అమ్మతోపాటే నన్ను కూడా పొలంలోకి తీసుకువెళ్ళేది. ఆ బాధకి అయిన రోజు ఉదయం అన్నం తినేదాన్ని. ఒకరోజు అమ్మతో నేను కూడా చేనుకి వెళ్ళాను. అమ్మ పసుపుపంట వెయ్యడానికి పసుపు కోస్తు ఉంటే, నేను కూడా అమ్మని చూస్తూ పసుపు కొయ్యడం మొదలుపెట్టాను.

అంతలోనే నాన్న, నేను అమ్మ పనిచేస్తు ఉన్న దగ్గరికి వచ్చాడు. నాన్న రాగానే నాన్నతో నేను ఓ మాట అన్నాను. నేను ఇప్పుడే ఇంత పసుపు కోస్తే పెద్దయ్యాక ఇంకా ఎంత పనిచేస్తానో అని. ఆ మాటకి నాన్న చాలా సంబరపడిపోయాడు, అసలు అంత చిన్న వయసులో ఇంత పెద్దమాట ఎలా అన్నానో నాకు కూడా అర్థం కాలేదు. ఇప్పటికి అమ్మా నాన్న ఈ మాట గుర్తు చేసుకుంటు చాలా నవ్వుతారు.

మా ఇంటికి 1 కి.మీ దూరంలో మా ప్రయిమరీ స్కూల్ ఉండేది. రోజు ఉదయం మా నాన్న నన్ను సైకిల్ మీద ఎక్కించుకొని స్కూల్లో దింపేసి వచ్చేవాడు. కానీ సాయంత్రం స్కూల్ ఆరు గంటలకి అయిపోయేది. అప్పటికి మా నాన్న పొలం నుంచి ఇంటికి వచ్చేవాడు కాదు. కాబట్టి సాయంత్రం నేను నడుచుకుంటు ఇంటికి వెళ్ళేదాన్ని. అలా నా ఐదవ తరగతి వరకు ప్రయిమరీ స్కూల్లో చదివాను.

నాన్న నన్ను ఎప్పుడు తిట్టలేదు. కానీ కోపంగా చూస్తేనే చాలు ఏడ్చేదాన్ని. అమ్మ ఎంత తిట్టినా అస్సలు పట్టించుకునేదాన్ని కాదు. (నాకు కాదు నా తోకకు అన్నట్టు ఉండేదాన్ని).

అమ్మా, నాన్న, అత్త పొలం పనికి వెళ్ళేవారు. అక్క హాస్టల్‌లో ఉండేది, కాబట్టి ఆ సమయంలో అమ్మ పొలం పనినుండి వచ్చేవరకు నన్ను మా పెద్దనాన్న (నాన్న వాళ్ళ రెండవ అన్న-పంతులు) కూతురు విజయ చూసుకునేది. నాకు చిన్నవయసులో గంజిబువ్వ అంటే చాలా ఇష్టం ఉండేది. విజయ అక్క వాళ్ళ అమ్మ (ముత్త) ప్రతిరోజు నాకోసం రాత్రికి ప్రత్యేకంగా గంజిబువ్వ చేసి తినిపించేది. నేను మా ఇంట్లో తినడం, ఉండడం చాలా తక్కువ. మొత్తం వాళ్ళ ఇంట్లోనే ఉండేదాన్ని. విజయ అక్క నన్ను, మా అక్కని సొంత చెల్లెల్లా చూసుకుంటుంది. నేను అమ్మా నాన్న దగ్గర ఉండడం కన్న విజయ అక్క వాళ్ళ అమ్మ దగ్గరే ఉండడానికి ఇష్టపడేదాన్ని. నేను సగం వాళ్ళ చేతుల మీదనే పెరిగాను.

విజయ అక్క తరువాత, అంతలా మా అక్క నన్ను చూసుకునేది. మా అక్క హాస్టల్ నుండి సెలవులలో ఇంటికి వచ్చినప్పుడు నన్ను అక్కనే చూసుకునేది. అన్నం తినిపించేది, స్నానం చేయించి రెడీచేసేది. రెడీ అంటే గుర్తొచ్చిందండీ! ఇప్పటికీ మా అక్క చెప్తూ నవ్వుతుంది, అదేంటంటే రెడీ చేసేదాక అక్క వేసిన డ్రెస్ వేసుకుని మొత్తం రెడీ అయిపోయాక నాకునచ్చిన డ్రెస్ వేసుకుని అక్కకి చూపించి మరీ ఆడుకోవడానికి వెళ్ళేదాన్నంట. చెప్తుంటే నవ్వొస్తుంది నాక్కూడా. అయినా మనం చిన్నప్పుడు ఏ చిన్న పనులు చేసినా ప్రేమించే వాళ్ళకి చాలా ఆనందాన్నిస్తాయి కదా.

నేను ఆరవ తరగతి చదువుతున్నప్పుడు ఆగష్టు 15కు వ్యాసరచన (ఎస్సే) పోటీలు ఉండేవి మా స్కూల్లో. అప్పుడు నేను ఆ పోటీల్లో పాల్గొన్నాను కానీ నాకు బహుమతి రాలేదు. నేను చాలా బాధపడ్డాను. కష్టపడి వ్యాసం నేర్చుకొని రాసింది మొత్తం వృధా అయింది అనుకున్నాను. ఇంటికి వెళ్ళగానే అక్కతో ఈ మాట ఏడ్చుకుంటూ చెప్పాను.

అప్పుడు మా అక్క నాకు ఒకటే చెప్పింది, నీకు బహుమతి రాలేదు అంటే నీవు ఏదో ఒకచోట పొరపాటు చేసి ఉంటావు, నీకు బహుమతి రాకపోయినా పర్వాలేదు, నీవు వ్యాసం రాయడం మాత్రం వదిలిపెట్టకు, ఎప్పటికైనా నీకు బహుమతి వస్తది అని చెప్పింది. అక్క చెప్పినట్టే ప్రతిసంవత్సరం ఆగష్టు 15కు, జనవరి26 కు వ్యాసం రాసేదాన్ని. కానీ తొమ్మిదవ తరగతి వరకు ఎప్పుడు బహుమతి రాలేదు. తొమ్మిదిసార్లు వ్యాసం రాయడంలో విఫలం అయినందుకు నాలో అంతులేనంత పట్టుదల పెరిగింది. పదవ తరగతి, జనవరి 26కి ఎవరు ఏం చెప్పినా వినే పరిస్థితిలో లేను, నా ఆలోచనంతా ఒకటే, నేను ఎలాగైనా బహుమతి సంపాదించాలి, అని వారం రోజుల ముందు నుండి వ్యాసం ప్రాక్టీస్ చేశాను. అప్పుడు నా కల నెరవేరింది. వ్యాసంలో ఫస్ట్ ప్రైజ్వచ్చింది. అదే వ్యాసాన్ని స్పీచ్ రూపంలో అనర్గళంగా ఏడు నిమిషాల పాటు మాట్లాడాను. స్పీచ్‌లో కూడా ఫస్ట్ ప్రైజ్ వచ్చింది. అంతా అక్క మోటివేషన్ వల్లనే, నేను ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎక్కడా ఆగకుండా నదిలా ప్రవహించాను. కాబట్టే నాకు ఐదు సంవత్సరాలకు వ్యాసంలో బహుమతి వచ్చినా ప్రథమ స్థానమే వచ్చింది. కష్టపడితే సాధ్యం కానిదంటూ ఏది ఉండదు.

నేను ఏడవ తరగతిలో ఉన్నప్పుడు డ్యాన్స్ పర్ఫామ్ చెయ్యడానికి నాపేరు కూడా నా స్నేహితులు మేడమ్‌కి ఇచ్చారు. అప్పుడు నాకు చాలా భయం వేసింది. (స్టేజ్ ఫియర్ చాలా ఉండేది) స్టేజ్ మీద కాలు పెట్టమంటేనే నా గుండె ఆగినంత పని అయ్యేది. ఆరోజు స్కూల్‌నుండి ఇంటికి వెళ్ళగానే అక్కతో ఈ విషయం అంతా చెప్పాను. అక్క ఒక గంటపాటు నన్ను పక్కన కూర్చోబెట్టుకొని నన్ను మోటివేట్ చేసింది. మోటివేట్ చెయ్యడంతోపాటు, నన్ను తక్కువ చేసి మాట్లాడింది. నాకు ఏది చేతకాదు, నేను ఏం చెయ్యలేను అన్నట్లు అన్నది. అక్క ఇలా అనడం నాకు నచ్చలేదు. అంతేకాకుండా నాలోనాకే ఒక సందేహం కలిగింది. అసలు నాకు ఏది చెయ్యడం చేతకాదా? అని అక్క నాతో మాట్లాడిన మాటలకు నేను ఎలాగైనా డ్యాన్స్ చేసి చూపించాలి, అని పట్టుదలతో మరుసటిరోజు స్కూల్‌కి వెళ్ళగానే డ్యాన్స్ ప్రాక్టీస్ చెయ్యడం మొదలుపెట్టాను. అలా డ్యాన్సర్ కాకపోయినా డ్యాన్స్ వచ్చు అనేవిధంగా తయారయ్యాను.

ఆరోజు అక్క నన్ను అలా తక్కువచేసి మాట్లాడి ఉండకపోయి ఉంటే నేను ఈరోజు డ్యాన్స్ చేసేదాన్ని కాదు. మనవారు మనల్ని తిట్టినా కొట్టినా అది మన మంచికే అని మనం గ్రహించాలి. నాకు సైకిల్ కూడా వచ్చేదికాదు. మా స్నేహితులకి సైకిల్స్ ఉండేవి. వాళ్ళు రోజు సాయంత్రం స్కూల్నుండి రాగానే సైకిల్ నడుపుకునేవారు. నేను మాత్రం వాళ్ళని చూస్తూ ఉండేదాన్ని ఒకరోజు మధ్యాహ్నం మా ఫ్రెండ్ సైకిల్ తీసుకొని మా ఇంటికి వచ్చింది. ఆమె సైకిల్ నాకోసమే తీసుకువచ్చినట్టు అయింది. నేను భయంతో నేర్చుకోను అని ఎంత ఏడ్చినా కూడా నన్ను కొట్టుకుంటూ మరీ ఒక్కరోజులో నాకు సైకిల్ నడపడం వచ్చేలా చేసింది. అందరు సైకిల్ నడుపుతుంటే నేను వాళ్ళని చూస్తూ ఉండకూడదు, నేను కూడా అందరితో సైకిల్ నడపాలి, వాళ్ళ మధ్యలో నేను తక్కువ అవ్వకూడదు అన్న ఉద్దేశ్యంతో నాకు కూడా సైకిల్ నేర్పించేసింది. నాకు సైకిల్ నడపడం వచ్చాక నాన్న సైకిల్ కొనిచ్చాడు. నా సైకిల్ నాకన్నా అక్కనే ఎక్కువగా వాడింది. పొలానికి - ఇంటికి, ఇంటికి - పొలానికి పనిమీద వాడి వాడి తుక్కు తుక్కు చేసింది.

**అక్క నా సంతోషం కోసం చేసిన కృషి.**

అందరు పుట్టినరోజుకి డ్రెస్ కొనుక్కోవడం, కేక్ కట్ చెయ్యడం, సెలబ్రేషన్ చేసుకోవడం ఇలాంటివి అన్ని చేస్తు ఉంటారు. మా అక్కకు కాని, నాకు కాని ఎప్పుడు కూడా పుట్టినరోజుకు ఇలాంటివి మా అమ్మానాన్న చేసేవారు కాదు. ఎందుకంటే మా అమ్మా నాన్నకు ఇలా సెలబ్రేట్ చెయ్యాలి అని తెలియదు కాబట్టి, కానీ అక్కా, నేను ఏరోజుకూడా బాదపడలేదు. మాకు మా పుట్టినరోజు సెలబ్రేట్ చెయ్యలేరు అని. మాకు ఏ కష్టం తెలియకుండా పెంచడానికే అమ్మా నాన్న పనిలో నిమగ్నం అయ్యేవారు. అక్క ఎప్పుడు పుట్టినరోజు వేడుకలు చేసుకోలేదు కాబట్టి ఎలాగైనా నా బర్త్డే సెలబ్రేట్ చెయ్యాలి అని అనుకుంది. అక్కకు నాకు మధ్య ఏజ్ గ్యాప్ ఎక్కువగా ఉండేసరికి తనకి నేనంటే చాలా ప్రేమ. ఒకసారి అక్క తన ఫ్రెండ్ వాళ్ళింటికి నన్ను తీసుకెళ్ళింది.

అక్కడ ఆ అక్కకి ఎవరో గిఫ్ట్ చేసిన కాఫీ కప్పు చూసి నచ్చిందని మా అక్కతో చెప్పాను. అంతే తర్వాత అక్క పైస పైస కూడబెట్టి తను తన కోసం ఏం కొనుక్కోకుండ నా బర్త్ డేకి సర్‌ప్రైజ్ చేసింది. ఆ కప్ నాకు చాలా చాలా ఇష్టం. ఇప్పటికీ ఇంటి దగ్గర ఉన్నప్పుడు అదే కప్‌లో టీ తాగడం నాకు అలవాటు. అదే సమయంలో అక్క మా ఊరిలో టీచింగ్ చేస్తూ ఉండేది. అక్కకు వచ్చిన మొదటి జీతం మొత్తం నాకోసం ఖర్చుచేసింది. అందులో నుండి ఒక్క పైస కూడా అక్క తీసుకోలేదు. అమ్మా నాన్నకు కూడా ఇవ్వలేదు. అక్క ఎప్పుడు చూసినా మా చెల్లికి ఏం కొనాలి, మా చెల్లిని ఇంక ఎంత సంతోషంగా చూసుకోవాలి అనే ఆలోచనలోనే ఉంటుంది.


you to
Sister

అక్క కొంచెం మల్టీ టాలెంటెడ్‌గా ఉంటుంది. డ్రాయింగ్ వేస్తుంది, ఆర్ట్ క్రాఫ్ట్ చేస్తుంది, సాంగ్స్ పాడుతుంది. డ్రాయింగ్ తనను చూసే గీయడం స్టార్ట్ చేశాను. అక్కకి డ్రాయింగ్ వెయ్యడం అంటే చాలా ఇష్టం. అచ్చం ఆర్టిస్టులాగే వేస్తుంది. అలా అక్క చార్ట్స్‌లో డ్రాయింగ్ వేస్తూ మా ఇంట్లో ఉన్న గోడలకు అతికించేది. మా ఇల్లు మొత్తం డ్రాయింగ్ చార్ట్స్‌తో కళకళలాడుతుండేది. అలా అక్క నాకు కూడా డ్రాయింగ్ వెయ్యడం నేర్పించింది. అక్కంత మంచిగా వేయరాదు, కానీ ఏదో డ్రాయింగ్ వేయడం వస్తదా అంటే వస్తది అన్నట్టు వేస్తా. అలా నేను కూడా వేయచ్చి వేయరాక చార్ట్స్‌లో డ్రాయింగ్ వేస్తూ ఇంట్లో అతికించేదాన్ని, అక్కతో పోటీగా. అక్క డ్రాయింగ్ చూస్తే ఎలా వెయ్యాలి అని నేర్చుకోవచ్చు. నా డ్రాయింగ్ చూస్తే ఎలా వెయ్యకూడదు అని నేర్చుకోవచ్చు. అలా వేసేదాన్ని. నేను ఇంటర్ హాస్టల్‌లో చదువుకున్నాను. అప్పుడు మాకు కాలేజ్ నుండి రాగానే సాయంత్రం స్టడీ హౌర్స్ ఉండేది. డిన్నర్ వరకు బాగానే చదువుకున్నా కానీ డిన్నర్ చేశాక నాకు చదవడానికి అస్సలు శ్రద్ధ రాలేదు. ఎంత చదవాలి అని ప్రయత్నం చేసినా నావల్ల కాలేదు. చదవకపోయినా నా స్నేహితులతో స్టడీహౌర్స్‌లో కూర్చుని నా పక్కన కూర్చున్నాను. నా స్నేహితురాలు ఫిజిక్స్ చదువుకుంటుంది.

ఆమె ఫిజిక్స్ నోట్‌బుక్ అట్టపైన మిక్కి మౌస్ బొమ్మలు ఉండే. నాకు మిక్కి మౌస్ బొమ్మలు అంటే చాలా ఇష్టం. బొమ్మలను చూడగానే ఎందుకో డ్రాయింగ్ వేయాలి అనిపించింది. అంతే ఇక పేపర్, పెన్సిల్ తీసుకొని మొదలు పెట్టాను. చూడండి, ఇక స్టడీ హార్స్ అయిపోయేలోపు ఆ బొమ్మ వెయ్యడం ముగించేశాను. విచిత్రం ఏమిటంటే సరిగ్గా డ్రాయింగ్ వెయ్యరాని నేను ఆ బొమ్మలను అచ్చం బుక్ అట్టపై ఎలా ఉందో అలా వేశాను. వాటిని గీయడమే కాకుండా వాటికి తగ్గట్టు రంగులు కూడా వేశాను. నాకు వాటిపై ఉన్న ఇష్టమేనేమో నేను వాటిని అంత అందంగా గీయడానికి కారణం. అప్పుడు నాకు ఒక విషయం అర్థం అయ్యింది, మనం పని చెయ్యాలి అంటే మనకు ఆ పనిపూర్తిగా రావలసిన అవసరం లేదు, కొంచెం అవగాహన ఉన్న, ఆ పనిమీద ఇష్టం ఉంటే మనం ఎలా అయినా దాన్ని విజయవంతం చేయగలుగుతాం.



Vajra Purre

అక్కా, నేను ఎప్పుడూ కొట్టుకునేవాళ్ళం. అక్కా నేను ఎప్పుడు గొడవ పడినా అక్కనే నన్ను తిట్టేది, మళ్ళీ అక్కనే ఏడ్చేది. ఎందుకంటే నేను చిన్నదాన్ని కాబట్టి, నాకు ఎంత చెప్పినా ఎలాగో అర్థం కాదు. అక్కనే అర్థం చేసుకొని ఉండాల్సింది. ఎందుకు అనవసరంగా చెల్లిని తిట్టిన అని బాధపడేది. నేను మాత్రం ఎంత తిట్టినా, పట్టించుకునేదాన్ని కాదు, తిట్టినంత సేపే డల్‌గా ఉండేదాన్ని, మళ్ళీ నా ఆటరోకు నాకే ఉండేది. (చెవిటి వాని ముందు శంఖం ఊదినట్టు) అక్కతో నేను గొడవపడిన ప్రతీసారి అమ్మ చేతిలో నా పని అయినట్టే. నేను అక్కను ఒక్కమాట అన్నాకూడా అమ్మ నన్ను తిట్టిన తిట్లు తిట్టకుండా తిట్టేది.

అమ్మ మొత్తం అక్క సైడ్ సపోర్ట్ చేసేది. నాన్న నా సైడ్ సపోర్ట్ చేసేవాడు. నా తప్పు ఉన్న కూడా నేనే గెలిచేదాన్ని ఎందుకు అంటే చిన్నదాన్ని కదా.

❀❀❀❀

నేను తెలిసీ తెలియక ఏదైనా పొరపాటు చేస్తే ఆ విషయం అమ్మా నాన్న వరకు తీసుకెళ్ళకుండా అక్కనే నన్ను దండించి సరైన దారిలో నడిపిస్తుంది. నాకు ఎలాంటి సమస్య వచ్చినా, అక్కనే చూసుకుంటుంది.

నేను చిన్న చిన్న విషయాలకే భయపడేదాన్ని. కానీ అక్క నాకు మొత్తం వ్యతిరేకంగా ఉండేది. దేనికి కూడా భయపడకుండా ధైర్యంగా ఎలాంటి సమస్య వచ్చినా ఆ సమస్యతో పోరాడి చివరికి ఆ సమస్యకు పరిష్కారం కనుక్కునేది. నాకు మాత్రం చిన్న బాధ వచ్చినా ఏడవడం ఒకటే తెలిసేది. కానీ ఇప్పుడు ఎలాంటి సమస్య వచ్చినా నాది నేనే స్వయంగా పరిష్కరించుకుంటున్నాను. నేను ఇలా తయారు అవ్వడానికి కారణం అక్కనే. అంతే కాకుండా క్యారెక్టర్‌లో కూడా నన్ను మా అక్క చాలా ఇన్‌స్పైర్ చేసేది. ఒకసారి దుకాణంలో వారు రిటర్న్‌లో మనీ ఎక్కువగా ఇచ్చారు. మేం సగం దూరం వచ్చాక మళ్ళీ తిరిగివ్వడానికి దుకాణంకి తీసుకెళ్ళి వారికి మనీ ఇచ్చేసింది. ఈ కాలంలో ఇలా ఎవరండీ ఉండేది? ఉంటారనుకోండి! కానీ చాలా తక్కువ, అందులో మా అక్క ఒకరు.



తేజస్సు

అక్క నాకు ఎప్పుడూ ఒకటే చెప్తూ ఉంటుంది. అమ్మా నాన్న మనకోసం బాగా కష్టపడి పనిచేసి అవసరమైనప్పుడు అప్పుచేసి చదివించారు. మనం వాళ్ళని కష్టపెట్టకుండా బాగా చూసుకోవాలని. ఎంతైనా ఇంట్లో మొదటివారు ఇలాగే ఆలోచిస్తారు కదా! అందులో అక్క కొంచెం ఎక్కువే అనుకోండి.

ఇంట్లో అక్క చాలా పాత్రలు పోషిస్తుంది. అమ్మా నాన్నల తర్వాత అందరికోసం అక్క ఆలోచిస్తుంది. నాకు మా అక్క మా అమ్మ తర్వాత అమ్మ, అక్క మంచి స్నేహితురాలు, మోటివేటర్, ఇలా ఒక్కటేమిటి చాలానే. అబ్బో! తనకి కోపం వస్తే నేను అంతే, ఒక రేంజ్‌లో తిడుతుందనుకోండి, అక్కా చెల్లెళ్ళ అనుబంధం ఎంత చెప్పినా అర్థం కాదు, అక్కా చెల్లెళ్ళలో ఎవరో ఒకరిగా ఉంటే మాత్రం ఆ బంధం ఎంత మధురమో అర్థం అవుతుంది.

ఇప్పుడు మా అమ్మను, నాన్నను, నన్ను అక్కనే చూసుకుంటుంది.



తేజస్సు

## About the Author



Purre Vajra hails from Vannel 'B', Balkonda Mandal, Nizamabad district. Her parents are Purre Bharathi and Purre Chinnadevanna. Vajra finished her SSC from ZPHS, Vannel 'B' and Intermediate from T.S.M.S.C, Balkonda. She is currently pursuing degree (MPC III year) at TSWRDC, Nizamabad. Vajra is interested in Playing Piano and writing books. The book Tejassu is about a sister who sacrifices her life for the sake of her brother. She teaches her brother how to lead a proper family. The book portrays sister as the most significance character who not only corrects the mistakes of her siblings but also stands as an example to her family by becoming an independent woman.

SCHOOL OF
EMERGING WRITERS
Telangana Social Welfare
Residential Educational Institutions Society

9 789348 512413